క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సదుం విద్యార్థులు



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆసిఫ్, ఆసిఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఫజురుల్లా సోమవారం తెలిపారు. అండర్–14 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

గృహ నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుగుణమ్మ

పులిచెర్ల(కల్లూరు): చల్లావారిపల్లె పంచాయతీలోని జగనన్నకాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను ఎంపీడీఓ సుగుణమ్మ సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీలో సాగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. మరింత మందికి ఉపాధి కల్పించేలా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ కృష్ణయ్య పాల్గొన్నారు.

పత్రపల్లె సచివాలయంలో ఆధార్ కేంద్రం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరాజు

వి.కోట: మండలంలోని పత్రపల్లె సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రంలో ఉచితంగా సేవలందిస్తారన్నారు. ఇంతకు ముందు స్థానిక అంబేద్కర్‌నగర్ సచివాలయంలోనూ ఆధార్ సేవలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఈఓ యాదపతి పాల్గొన్నారు.

తహసీల్దార్ మురళి బాధ్యతల స్వీకరణ



రామకుప్పం: తహసీల్దార్‌గా మురళి బాధ్యతలను సోమవారం స్వీకరించారు. గంగవరం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని తెలిపారు.

ముగిసిన తిరునాళ్ల



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తిరునాళ్ల సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం హోమం, సాయంత్రం పార్వేటి ఉత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామకపత్రాలు



నియమక పత్రాలు అందిస్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల: అంగన్‌వాడీలుగా ఎంపికైన వారికి ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి నియమాక పత్రాలను సోమవారం అందించారు. బొమ్మయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌గా టి.సుస్మిత, జగడంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్‌గా వై.సరస్వతి నియమక పత్రాలను అందుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పుంగనూరు : మండలంలో సాగుతున్న ఉపాధి హామీ పనులు, జగనన్న పచ్చతోరణం కింద నాటిన మొక్కలను ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీఓ రాజేశ్వరి సోమవారం పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 16,400 మొక్కలు నాటినట్లు తెలిపారు. వీటి సంరక్షణ బాధ్యతను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 80శాతం మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయని వివరించారు.

సంతృప్తికరంగా సంక్షేమం

- పారదర్శకంగా పథకాల అమలు
- ఆదర్శవంతంగా పాలన
- ఎప్పటికప్పుడు ప్రజాసమస్యల పరిష్కారం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట : రాష్ట్రంలో సంతృప్తికరంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. సోమవారం మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ సుద్దులకుప్పం, ఏడుచుట్లకోట, కొత్తపల్లె, రామతీర్థ గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల హామీల్లో దాదాపు 95శాతం నెరవేర్చినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లడం ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వెసులుబాటు వచ్చిందని వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి సమస్యలకు సైతం చెక్ పెట్టే అవకాశం దక్కిందని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను చేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నదే అన్నారు. లబ్ధిదారులను నేరుగా కలిసినప్పుడు వారి ఆనందం చూస్తుంటే ఎనలేని సంతృప్తి కలుగుతోందన్నారు. ప్రభుత్వంపై టీడీపీ ఎంతగా అసత్య ప్రచారాలు చేసినా జనం నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. వి.కోట మండలంలో 20 ఏళ్లుగా కుంటుపడిన అభివృద్ధిని ఈ మూడేళ్లలో పరుగులు తీయించామన్నారు. ఇవన్నీ కనిపిస్తున్నా చూడనట్లు నటిస్తూ విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్, సర్పంచ్ దామోదరం, జూనియర్ కళాశాల చైర్మన్ అమరనాథ్, సింగిల్‌విండో చైర్మెన్ గోపిరెడ్డి, స్థానిక నేతలు రాధాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, భూపతి పాల్గొన్నారు.



వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం

సోమల: జగనన్న కాలనీల్లో మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ నాగరాజా ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉగాదిలోపు అన్ని పనులు పూర్తి చేయించాలని సూచించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఎక్కడైన సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు షారు బాషా, మణికర, పంచాయతీ కార్యదర్శి దివ్య భారతి, వీఆర్‌ఓ శ్రీజ పాల్గొన్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజా

రూ.20లక్షలతో మొరపకుంట అభివృద్ధి

చౌడేపల్లె : మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీలో ఉన్న మొరపకుంటను రూ.20లక్షల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు డ్వామా ఏపీడీ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మొరపకుంటను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుంట కట్ట బలోపేతం, నీటి నిల్వకు అవసరమైన పనులను ఉపాధి పథకం కింద చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో ప్రతి కుటుంబానికి కనీసం వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఏపీఓ శ్రీనివాస్ యాదవ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూరాధ, కోటేశ్వరరావు, బాబు రెడ్డి, జేఈ ధనుంజయుడు, టీఏ అమరనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మొరపకుంట పరిశీలనలో ఏపీడీ వరప్రసాద్

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

పుంగనూరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన మదనపల్లె బీటీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఎంపీ పీఏలు రాజు, దస్తగిరి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ పోస్టర్ విడుదల చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎంపీ మిథున్‌రెడ్డి ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 60 కంపెనీలు మేళాకు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, రమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

వి.కోట : మండలంలోని తోటకనుమ గ్రామంలో చిరుధాన్యాల సాగు, ఉత్పత్తులు, పోషక విలువలపై మహిళా రైతులు, విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. రైతులు సైతం చిరుధాన్యాల సాగుకు ముందుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ , వ్యవసాయ సహాయకుడు కార్తీక్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, విద్యార్థులు

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి



గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు కిట్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సోమల : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లె, పొదలగుంటపల్లె పంచాయతీల సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. ×నా నమ్మకం నువ్వే జగన్ు సామగ్రిని పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం సంబంధిత కిట్‌లను అందించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీపీ ఈశ్వరయ్య, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు

చౌడేపల్లె : ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు మాట్లాడుతూ సమష్టిగా కృషి చేసి మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అత్యధిక మెజారిటీని బహుమతిగా అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కుప్పం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం కుప్పంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ ప్రాంగణంలో జీఎస్‌రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది.

9 నుంచి గృహ సారథులకు శిక్షణ

సదుం : గృహసారథులకు ఈ నెల 9, 10 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప హాజరవుతున్నట్లు వెల్లడించారు.

నేడు చౌడేపల్లెలో..

చౌడేపల్లె : స్థానిక అంబేద్కర్ భవనంలో మంగళవారం ఉదయం 9:30 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటా చలపతి , మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం హాజరవుతున్నట్లు వెల్లడించారు.

కుప్పంలో ..

కుప్పం : పురపాలక పరిధిలోని గృహసారథులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయం సోమవారం తెలిపింది. కృష్ణగిరి రోడ్డులోని వాణీ మహల్‌లో సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్సీ భరత్ హాజరవుతున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భవ్యశ్రీ



చౌడేపల్లె : మండలంలోని పరికిదొన ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.భవ్యశ్రీ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు టి.నాగరాజా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో భవ్యశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. విద్యార్థినిని పీడీ గాయత్రి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు అభినందించారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా అజిత్



శాంతిపురం : పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా అజిత్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి కన్నన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మండల సంఘం గౌరవాధ్యక్షుడిగా గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా భూపాల్, ఆర్థిక కార్యదర్శిగా ప్రహ్లాద్, కన్వీనర్‌గా రఘురామ్, మహిళా అధ్యక్షులుగా హేమలత, ప్రధాన కార్యదర్శిగా శివకుమారిని ఎన్నుకున్నారు. శంకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

శభాష్ వలంటీర్

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె పంచాయతీ దొమ్మరి పాళ్యం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో వారం రోజుల క్రితం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ లక్ష్మీదేవి సుమారు 125 కిలోమీటర్ల దూరం వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందించి శభాష్ అనిపించుకుంది.



పింఛన్ అందిస్తున్న వలంటీర్

సకాలంలో సమస్యల పరిష్కారం

పుంగనూరు : గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం సచివాలయ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు కార్యక్రమంలో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ మిథున్‌రెడ్డి పీఏలు రాజు, దస్తగిరి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్ పాల్గొన్నారు.

'స్పందన' వినతులకు ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు : స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఆదేశించారు. సోమవారం పురపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆమె పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందనలో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్‌పర్సన్ నాగపద్మిని

కుప్పంరూరల్ : చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని జిల్లా రిసోర్స్ పర్సన్ నాగపద్మిని తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో మహిళా రైతులకు , సుస్థిర వ్యవసాయం, సేంద్రియ, చిరుధాన్యాల సాగుపై శిక్షణ ఇచ్చారు. నాగపద్మిని మాట్లాడుతూ సేంద్రియ విధానంలో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. మార్కెట్ ధరలను దృష్టిలో ఉంచుకుని వినూత్న సాగు పద్ధతులను పాటించాలని కోరారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమృతవల్లి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజూ నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ కేశవపిళ్లై ఆదేశించారు. సోమవారం మండలంలోని సూరయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కేశవపిళ్లై

రీసర్వేలో పొరబాట్లపై ఫిర్యాదు

పలమనేరు : మండలంలోని మారేడుపల్లె రైతులు తమ గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో జరిగిన పొరబాట్లపై సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందనలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సర్వే బృందం నిర్లక్ష్యం కారణంగా సర్వే నంబర్లు మారిపోయాయని, వాస్తవ విస్తీర్ణం తగ్గిందని, అనుభవంలో లేనివారి పేర్లు వచ్చాయని పేర్కొన్నారు. దీనిపై గతంలో గంగవరం తహసీల్దార్‌కు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో గురుమూర్తి, వెంకటప్ప, మొగిలప్ప, హేమంత్, లక్ష్మయ్య ఉన్నారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు

పూరిల్లు దగ్ధం

గంగవరం : మండలంలోని రొంటకుంట్లలో ఆదివారం రాత్రి ఓ పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. చిన్నపాపమ్మ అనే మహిళ ఒంటరిగా గుడిసెలో నివసిస్తోంది. రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించేందుకు మరొకరి ఇంటికి వెళ్లింది. కాసేపటి తర్వాత ఆమె గుడిసెకు నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు మంటలు అదుపు చేసేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంట్లోని సామగ్రి, నగదు, బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే గుడిసెకు నిప్పు పెట్టినట్లు ఆరోపించింది. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ అమరనాథ్ సోమవారం ఉదయం గ్రామానికి వెళ్లి దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమరనాథ్

రావణ వాహనంపై విశ్వేశ్వరుడు

పట్టణంలోని కాశీవిశ్వేశ్వరుని ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సోమవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఉదయం పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిపించారు. ఎస్వీఎంఎస్ ట్రాన్సుపోర్టువారు ఉభయదారులుగా వ్యవహరించారు. నేడు స్వామివారి శయనోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

\- పలమనేరు

